# దూరం-దూరం-ఎంతెంత దూరం!

**కథ** -జె. సునీల్

**ఫోన్ రింగవుతోంది.**

**ఆ ఫోన్ ఎక్కడి నుంచి వచ్చిందో కౌసల్యమ్మకు తెలుసు. కానీ ఆ వైపు వెళ్ళి ఫోన్ లిఫ్ట్ చేయడానికి భయమేసింది. 'సురేష్ ఏమన్నాడో?'**

**కౌసల్యమ్మ ఆ గదిలో నుండి హాల్లోకి వెళ్ళి ఫోన్ లిఫ్ట్ చేసి "హలో" అంది.**

''అత్తమ్మా!''

దూరతీరాల నుండి వచ్చి చెవులను సోకిన ఆ పిలుపు, కౌసల్యమ్మలో ఆనందానికన్నా ఆత్ర తనే నింపింది. ''చెప్పమ్మా స్రవంతీ! అ...అబ్బాయి ఏమన్నాడు?''

అవతలివైపు రెండు క్షణాల మౌనం. తన కోడలు విషయం చెప్పడానికి సంశయిస్తూ నస గటంతోనే, జవాబేమిటో అర్థమైపోయింది. ఆవిడకు గుండెవేగం పెరిగింది. అయినా ఏదో తెలియని ఆశ చెవులు రిక్కించేలా చేసింది.

''అది...అత్తమ్మా! ఆయన బాగా బిజీగా వున్నారట. ఏదో కొత్త ప్రాజెక్ట్ పని వల్ల సెల వులు దొరకటమూ కష్టమేనంటున్నారు. మరో ఆరునెలల్లోనైతే ఏదోలా వీలుచూసుకుని వెళ్ళగ లమని చెప్పారు''

ఒక్కసారిగా నీరసం చుట్టుముట్టేసింది. ఆ తర్వాత స్రవంతి మరేదో చెపుతోంది. ఆ మాటలేవీ తనకు వినిపించటం లేదు. కోడ లితో మాట్లాడాలనీ అనిపించలేదు. ''సరే నమ్మా'' అనేసి ఫోన్ పెట్టేసింది.

కొద్దిక్షణాలు అక్కడే నిలబడిపోయింది. హాలులో నుండి పదడుగులు ముందుకేసి పడక గదిలోకి వెళ్ళాలంటే, ఆ క్షణం ఎప్పుడూ కలగ నంత భయం కలిగిందామెకు.

ఆ గదిలో-పడక మీద నుండి లేవలేని ఆ మనిషి కళ్ళు మాత్రమే కదిలించి తనకేసి ఆశగా చూస్తాడు 'ఫోన్ వచ్చింది కదా? అబ్బాయి కెనడా నుంచి వస్తున్నాడా?' అన్న ప్రశ్న ఆ చూపుల్లో తనకు కనిపిస్తుంది.

మరిప్పుడు తనేం జవాబివ్వాలి?

ఆ గదిలోకి వెళ్ళ లేదు. అలాగని అక్కడే వుండలేదు. చివరికి ధైర్యం తెచ్చుకుంది. జవాబుగా ఏం చెప్పాలో నిర్ణయించుకోకుండానే పడకగదిలోకి అడుగు పెట్టింది. క్షణం పాటు నేల చూపులు చూసాక తలెత్తి, చూపులు అటు సారించింది. చిరు కల వరపాటులో తనువు కదిలింది.

ఊహించినట్టుగానే తన భర్త ప్రశ్నార్థకంగా తనకేసి చూడడం లేదు. సర్వం అర్థం చేసు కున్న యోగిలా నిర్మలంగా తనకేసే చూస్తు న్నాడు. దాంతో ఆశ్చర్యపోవటం ఆమె వంత య్యింది.

''ఏంటలా చూస్తున్నారు?'' ప్రశ్నించింది.

అచ్యుతరామయ్య నవ్వాడు. లేదు. పెద వులు వెడల్పు చేసాడు. భార్యకేసి ఆప్యాయంగా చూస్తూ ''బ్బే...బ్బే..బెబ్బే..'' అన్నాడు. పక్ష వాతంతో ఆయన నోరుపడిపోయినా, ఆ నోట పలికే ప్రతి శబ్దం వాక్యంగా మలచుకోగలిగిన నేర్పు ఆమెకు ఎప్పుడో వచ్చేసింది. ముప్పై య్యేళ్ళ సంసార జీవితంలో భర్త చూపులనూ చదవటం నేర్చేసుకుంది. అందువల్లే ఆయన ఇప్పుడు ఏమన్నాడో ఆమెకు అర్థమయ్యింది ''అబ్బాయి కెనడా నుంచి రావట్లేదు- అని చెప్ప డానికి నువ్వు ఇంతగా బాధపడక్కర్లేదులే కౌసల్యా!...ఆనందంగా పరుగెత్తుకొచ్చి విషయం చెప్పాల్సిన నువ్వు అడుగులో అడుగే సుకుంటూ వస్తున్నప్పుడే, అటునుండి వచ్చిన జవాబేంటో నాకర్థమైపోయింది''

అప్పటివరకూ అతికష్టంమీద కన్నీళ్ళు బుగ్గల మీదకు జారకుండా ఆపుకోగలిగింది. భర్త మనసు తెలిసాక, ఆ మనసులో దాగి వున్న వ్యథ అర్థమయ్యాక ఆమె ఇక ఆగలేకపోయింది. ఒక్క అంగలో మంచాన్ని చేరుకుంది. భర్త చేతిని తన చేతిలోకి తీసుకుంది. అప్పటికీ దుఃఖాన్ని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయ త్నిస్తూ పలికింది.

''పరిస్థితి చెప్పాక కూడా సురేష్ ఇలా అంటాడని ఊహించలేకపోయాను. వాడిప్పుడు డబ్బు మనిషైపోయాడు''

ఆ క్షణం అచ్యుతరామయ్యకు భార్యను రెండు చేతుల్లో పొదివి పట్టుకుని తన గుండెల్లో దాచుకోవాలనిపించింది. 'కానీ శరీరంలోని సగ భాగం కదలడం మానేసి ఆరునెలలయిపో యింది. ఇదిగో...ఇప్పుడు సెకండ్ హార్ట్ ఎటాక్ కూడా వచ్చి వెళ్ళిపోయింది. ఈ బలహీనమైన, గుండె ఏ క్షణమైనా ఆగిపోవచ్చు. గుండె ఆగక ముందే తన బిడ్డను చూసుకోవాలనుకోవడం ఏ తండ్రి అయినా కోరుకునేదే!'

భర్త కోరిక తెలిసిన కౌసల్య కెనడాలోని కొడుకు కోసం ఫోన్ చేసింది. జవాబేంటో కూడా తెలిసిపోయింది.

కౌసల్యమ్మ తనను తాను సర్దుకునే ప్రయత్నం చేసింది. సమస్య తమవైపు కాకుండా కొడుకు వైపు చూడదలిచింది. అందువల్లే ఆయనతో అంది ''డబ్బుకోసం ఆరాటం కాక పోవచ్చు లెండి. నేటితరం పోటీ ప్రపంచంలో వుంది. అడుగు వెనక్కుపడితే, వెనుకబడిపోయే ప్రమాదముంది. అందుకే వాళ్ళు కెరీర్ మలచు కునే ప్రయత్నంలో కన్నవారినీ పక్కన పెట్టే సారు. మనమూ వాడిని అర్థం చేసుకోవాలి''


అచ్యుతరామయ్య ఎలా అర్థం చేసుకున్నాడో తెలియదు. మరోసారి నవ్వడానికి ప్రయత్నిం చాడు.

ఎవరి అభిప్రాయం వారిది కావచ్చు. కానీ ఒకరి అభిప్రాయం మరొకరి జీవితాన్ని ప్రభా వితం చేయడం సహజం. అందులోనూ విదేశా లకెళ్ళి స్థిరపడిన వ్యక్తుల అభిప్రాయాలూ, ఈదేశంలోని వారి తల్లిదండ్రుల జీవితాలను ప్రభావితం చేయటమే కాదు, పరితపించే లానూ చేస్తున్నాయి.

వృద్ధాప్యంలో అండగా వుండలేని పరిస్థి తులు, ఆఖరిచూపుకైనా అందుకోలేనంత దూరం...తప్పొప్పుల సమీక్ష పక్కన పెట్టినా, మనిషి తనవారి కోసం పరితపించటం సహజం!

కౌసల్యమ్మ మనసు లోని బాధ అదే! ''తన తండ్రి అంత్యక్రియల కైనా సురేష్ హాజరుకాగ లడా? తలకొరివి పెట్ట గలడా?'' అది సాధ్య మని తనకూ అనిపిం చటం లేదు.

పరితపించటమ



న్నది అనుభవం లోకి వస్తేనే అర్థమయ్యే విషయం!

★ ★ ★

అచ్యుతరామయ్య పరిస్థితి మరికాస్త క్షీణించింది. 'వారం, పది రోజులకు మించి ఆయన బ్రతకడని' బంధుమిత్రులంతా నిర్ణయం చేసుకున్నారు.

కౌసల్యమ్మ ఆఖరి ప్రయత్నం చేయాలనుకుంది. ఫోన్ దగ్గరగా వెళ్ళబోతుంటే, అదే రింగయ్యింది.

ఆమె ఫోన్ లిఫ్ట్ చేసింది. ''హలో''

అవతలి వైపునుండి స్రవంతి గొంతు వినిపించింది.

కోడలి గొంతు వినగానే మొదట ఆశ. ఆ గొంతులోని దుఃఖం అర్థంకాగానే ఆశ్చర్యం. మాటలు వినిపించగానే...షా...క్!

మొదట కోడలి మాటలు నమ్మాలనిపించలేదు. ఆ మాటలు అబద్ధాలైతే బాగుండుననిపించింది. కాని నిజం అని తెలియగానే, తట్టుకోలేక నేలకు జారిపోయింది కౌసల్యమ్మ.

ఎవరో వచ్చి ముఖాన నీళ్ళు చల్లి లేవదీసారు. ''ఏం జరిగింది కౌసల్యమ్మా?'' అడిగారు ఆత్రుతగా!

కౌసల్యమ్మకు గొంతు పెగలడం కష్టమయ్యింది. అతికష్టం మీద పదాలు కూడదీసుకుని పలికింది ''మా...మా సురేష్‌కి యాక్సిడెంట అయ్యిందట'' అంటూనే దుఃఖం ఆపుకోలేక ఏడ్చేసింది.

''పెద్ద ప్రమాదమా?''

''ఆ!..''

ఎవరో ఈ విషయం అచ్యుతరామయ్యకు చెప్పేసారు.

ఆ దారుణవార్త విని ఆ బలహీనమైన గుండె తట్టుకోలేదేమోనని భయపడింది కౌసల్యమ్మ. కాని జీవితాన్ని అర్థం చేసుకున్న ఆయన ఆమెనే ఓదార్చే ప్రయత్నం చేసాడు.

'అటు చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న కొడుకు, ఇటు రేపోమాపో మరణం తథ్యం అనిపిస్తున్న భర్త' ఆడదానికి అంత బాధాకరమైన పరిస్థితి మరోటి వుండదు.

'ఏ క్షణం ఎలాంటి వార్త వినవలసి వస్తుందోనన్న భయం' ఆవిడ గుండె వేగాన్ని పెంచేసింది.

అచ్యుతరామయ్య భార్యకేసి జాలిగా చూస్తున్నాడు.

గంట తర్వాత మరోసారి ఫోన్ మ్రోగింది. ఫోన్‌కేసి ఆమె అలాగే చూస్తుండిపోయింది. అటు వెళ్ళాలనిలేదు. ఆ ఫోన్ లిఫ్ట్ చేయాలంటే..ఏదో తెలియని భయం!


అచ్యుతరామయ్య కళ్ళతోనే ఆమెకు సైగ చేసాడు. 'వెళ్ళి ఫోన్ లిఫ్ట్ చెయ్యి'

ఆ ఇంట్లో గుమికూడివున్న బంధుమిత్రులు కూడా ఆతృతగా ఆమెనే చూస్తున్నారు. నిన్నటి వరకూ వారంతా ఆమెకేసి గొప్పగా చూసేవారు. 'ఆమె అదృష్టవంతురాలు' అని పొగిడేవారు. 'కొడుకు కెనడాలో వుండడమంటే మాటలు కాదు. పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు- అంటారు. ఆ విధంగా ఆమె గత జన్మలో ఎన్ని దానాలు చేసి వుంటే అలాంటి కొడుకును కనగలిగిందో..'

అలా అనుకున్నవారి అభిప్రాయాలన్నీ ఒక్కసారే మారిపోయాయి. వారంతా ఆమెకేసి జాలిగా చూస్తున్నారు. 'పాపం కౌసల్యమ్మ! ఏ జన్మలో ఏ పాపం చేసిందో? అటు కొడుకు, ఇటు భర్త ఒక్కసారే ప్రాణాపాయస్థితిలో పడ్డారు..'

కౌసల్యమ్మ ఫోన్ లిఫ్ట్‌చేసింది. అవతలి వైపు నుండి స్రవంతి గొంతు వినిపించింది.

''అత్తమ్మా! ఆయన.. ఆయన పరిస్థితి మరీ సీరియస్‌గా వుంది. 'సురేష్ మిమ్మల్ని చూడాలని కలవరిస్తున్నాడు. డాక్టర్లు కూడా మీరొస్తేనే బాగుంటుందని అంటున్నారు'' తను వెక్కి వెక్కి ఏడుస్తోంది.



కొడుకు పరిస్థితి కనుల ముందు కదలగానే, ఆ తల్లి గుండె కరిగి రక్తం ధారగా కారుతున్నంతగా కదిలిపోయింది. కానీ తనేం చేయగలదు?

అది అర్థం చేసుకున్నట్టే స్రవంతి కంటిన్యూ చేసింది. ''నాకు..నాకు తెలుసు- అక్కడ


మామయ్య పరిస్థితి బాగోలేదు. ఇలాంటి పరిస్థితిలో ఆయన రాలేరు. ఆయనను అలా వదిలి మిమ్మల్ని రమ్మనటమూ సరికాదు. కానీ...కాని ఆయన కలవరింతలు చూస్తుంటే తట్టుకోలేకోతున్నాను.. సురేష్ మిమ్మల్నే కలవరిస్తున్నాడు''

కౌసల్యమ్మ తట్టుకోలేక ఏడ్చేసింది.

''ఏదో సమయంలో తల్లికి కొడుకు మీద కోపం కలగొచ్చు. అయినాసరే, ఆ బిడ్డకు బాధ కలిగితే మాత్రం తను తట్టుకోలేదు. కోపాన్ని ప్రేమ జయించి, కొడుకు మీద ఆప్యాయత వర్షించేలా చేస్తుంది''

''ఒకవేళ ఏదోలా రమ్మని చెప్పాలన్నా, పాస్‌పోర్ట్, వీసాలప్రాబ్లమ్ ఎలాగూ వుంది. అందుకే ఏం చేయాలో నాకు తోచటం లేదు. కనీసం నన్ను ఓదార్చే వాళ్ళు, ధైర్యం చెప్పేవాళ్ళు కూడా ఇక్కడెవ్వరూ లేరు''

అటు స్రవంతి, ఇటు కౌసల్యమ్మ ఏడుస్తుంటే, ఫోన్ ఎప్పటికో దానంతట అదే కట్ అయ్యింది.



### తప్పులు తెలియాలంటే...!

**సినిమాతారలు ఎవరికైనా తాము నటించిన అన్ని సినిమాలు హిట్ కావాలనే కోరుకుంటారు. కానీ ఇలియానా మాత్రం మధ్యలో ఒకటి రెండు పరాజయాలైనా ఎదురు కావాలని కోరుకుంటుందిట. ఎందుకంటారా? వరసగా అన్నీ సక్సెస్‌లుంటే ఇక తనలోని లోటుపాట్లు తనకి తెలియవట. అందుకని ఏదైనా సినిమా పరాజయం పాలైతే అందులో తను చేసిన తప్పేంటో తెలుసుకుని మరోసారి అలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తపడవచ్చు అనేది ఇలియానా ఆలోచట. మంచి ఆలోచనే! అంటే 'ఖతర్నాక్' లాంటి సినిమాలు ఆమె కెరీర్‌కి మంచే చేస్తాయన్నమాట!**

మరో గంట తర్వాత అదే ఫోన్ మ్రోగింది. వినకూడని మాట, వినకూడదని అనుకుంటున్న మాట ఆవిడ చెవులపడేలా చేసింది.

''సురేష్ చనిపోయాడు''

అనుకోనివిధంగా ముగిసిపోవటం-ఇదేనా జీవితమంటే?

★ ★ ★

దేవుడి అనుగ్రహమో లేక కట్టుకున్న ఇల్లాలిని అలాంటి స్థితిలో వదిలి వెళ్ళకూడదన్న బలీయమైన కోరిక వల్ల కావచ్చు, అచ్యుత రామయ్య కాస్త కోలుకున్నాడు. మరణాన్ని మరికొంతకాలం వాయిదా వేసాడు.

పదిరోజుల తర్వాత స్రవంతి ఇండియాకు తిరిగొచ్చింది.

ఎలక్ట్రికల్ క్రిమేషన్ ద్వారా అందిన చితాభస్మంతో పాటు, ఓ ఆడియో క్యాసెట్ తన అత్తగారికి అందించి చెప్పింది. ''జీవితంలో అన్నింటికన్నా కెరీర్ ముఖ్యమనుకుంటారు. కెరీర్ ముఖ్యమే. కానీ కష్టకాలంలో మనిషి తాలూకూ చివరి క్షణాలలో మరణం దగ్గరవుతున్నప్పుడు ఆ మనిషికి తను సంపాదించిన మనీ, సాధించిన కెరీర్ గుర్తుకు రాదు. డబ్బు కళ్ళ ముందు కదలదు. తన హోదా మనసులో మెదలదు. ఆ క్షణాలలో అతడి మనసు తనకున్న బంధాలను గుర్తుచేసుకుంటుంది. అనుబంధం వున్న మనుష్యులను చూడటం కోసం పరితపిస్తుంది. మిగిలిన సమయాలలో కోరుకోని, తలచుకోని మనుష్యులను కూడా, తన చివరి ఘడియలలో తన పక్కనే వుండాలని కోరుకుంటాడు మనిషి. సురేష్ కలవరించటం, స్పృహలోకి వచ్చినపుడల్లా మీకోసం దిక్కులు చూస్తూ వెతుక్కోవటం చూసినప్పుడే నాకీ విషయం మొదటిసారి అర్థమయ్యింది. మనిషి తన చివరి క్షణాలలో తనవారి కోసం పరితపించటం ఎలా వుంటుందో ప్రత్యక్షంగా నేను చూసాను. మీరు కనీసం వింటారని, మీ అబ్బాయి తన చివరిక్షణాలలో మీకోసం ఎంతగా పరితపించాడో తెలుసుకుంటారని, రికార్డ్ చేసుకుని వచ్చాను''

స్రవంతి కంటి నుండి నీరు ధారగా బుగ్గల మీదకు జారుతోంది. కన్నీటిని తుడుచుకునే ప్రయత్నం చేయకుండానే, ఆమె హాలులోనే వున్న టేప్‌రికార్డర్‌లో ఆడియో క్యాసెట్‌ని పెట్టింది.

అరుదైన సంఘటన కాదది. అప్పుడప్పుడు విదేశాల్లో వినిపించే వార్త. ఇక్కడి కొందరి బ్రతుకులను చిందరవందర చేసే వాస్తవం. కాకపోతే నాలుగు గోడల మధ్య నినదించి, నీరసించిపోవలసిన గొంతు, రికార్డెడ్ మెసేజ్‌లా అందరికీ వినిపిస్తోంది.

''అమ్మా! నాకు నిన్ను చూడాలనుంది. స్రవంతీ! నాన్నొచ్చాడా?...అయ్యో! వాళ్ళింకా రాలేదా?...వాళ్ళను చూడకుండానే చనిపోతానా?... నాకు అ...మ్మ... నా...న్న...ల...ను... చూ..డా.. ల..నుం..ది.. ఆ!...''

ఆ గొంతు ఆగిపోయింది.

సురేష్ చివరి క్షణాలలోని కలవరింతలు విన్నాక మనసుంటే కరుగుతుంది. మెదడుంటే ఆలోచిస్తుంది.

కాని మెదడు, మనసు స్థంభించిపోయిన స్థితిలో ఆ ముసలివాళ్ళు మాత్రం ఏడుస్తున్నారు.

☆